www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY


సోమవారం, 31-08-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :117 Issue : 117 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



భారత్–ఉజ్బెకిస్థాన్ భాగస్వామ్యానికి

## నూతన ఊపు

4

రియల్‌ఎస్టేట్ సంస్థగా

## కాంగ్రెస్ ప్రభుత్వం

- రూ.500 కోట్ల విలువైన భూమిని రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించే యత్నం
- ఆయిల్‌ఫెడ్‌కు భూమి దక్కకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- 1987 సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శ
- ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని వ్యాఖ్య



**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:** నగరం నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ సంస్థగా మారిపోయిందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ సమాజ సంక్షేమాన్ని పక్కనబెట్టి కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అజామాబాద్ భూముల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సుదీర్ఘ బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2వ పేజీలో..

## వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

- కుటుంబ పాలనకు ముగింపు..
- ప్రజలకు చేరువైన పాలన ప్రజావాణి, గ్రామసభలతో ప్రజల ముంగిటకు ప్రభుత్వం 3.42 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం పంపిణీ
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో ముందడుగు అప్పుల భారంలోనూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

2



# ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజులు

రైతు రుణమాఫీ: రూ. 2 లక్షల వరకు మాఫీ


- రైతు భరోసా: రూ. 36,000 కోట్లకు పైగా పెట్టుబడి సాయం
- మహాలక్ష్మి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- గృహజ్యోతి: 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- సబ్సిడీ గ్యాస్: రూ. 500కే సిలిండర్
- ఇందిరమ్మ ఇళ్లు: కొత్త గృహాల నిర్మాణం
- కుల సర్వే: సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వే

5



- వర్గీకరణ & రిజర్వేషన్లు: ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు
- ఉద్యోగ నియామకాలు: మెగా డీఎస్సీతో సహా 72,000+ ప్రభుత్వ ఉద్యోగాలు
- విద్యా రంగాలు: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలు, స్కిల్స్ యూనివర్సిటీ
- వైద్యం: ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, కొత్త మెడికల్ కాలేజీలు



## వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

- మొక్కలు నాటడంతో బాధ్యత తీరదు.. సంరక్షణే కీలకం
- 6.18 కోట్ల మొక్కల నాటడమే లక్ష్యం
- ఇప్పటికే 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు వెల్లడి
- గుంతల తవ్వకంలో 92 శాతం.. నాటడంలో 91 శాతం పురోగతి
- 2.75 కోట్ల పండ్ల మొక్కల పంపిణీకి ప్రణాళిక

2



## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

- ఉదయం 10 గంటలకు ఉభయ సభల సమావేశాలు ప్రారంభం
- అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు సీఎం రేవంత్ సవాల్

2

తెలంగాణలో గోదావరి పుష్కరాల

## నిర్వహణకు సన్నాహాలు

- గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ గుర్తొచ్చేలా ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు
- ఏర్పాట్లకు రూ.1,000 కోట్లు మంజూరు
- భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం
- శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం

3



## మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

- రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం
- 14.5 మీటర్ల వెడల్పుతో వంతెన.. 3.5 మీటర్ల ఫుట్‌పాత్
- అంబర్‌పేట్–మూసారాంబాగ్ మధ్య ఏడాది పొడవునా రాకపోకలు
- వర్షాకాలంలో ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం
- ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కర్ణన్ ఆదేశం

2





## ఆర్‌ఎస్‌ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

- ముస్లింలపై తియ్యటి మాటలు చెప్పడం మానండి
- ఆర్‌ఎస్‌ఎస్ పాత సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాలి
- గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ విమర్శలు
- మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ప్రపంచానికి ఒక మాట.. కార్యకర్తలకు మరో మాట అన్న ఒవైసీ

2



## భారత వైద్య వ్యవస్థపై విదేశీ అనుభవంతో డాక్టర్ ప్రశంసలు

- బ్రిటన్‌తో పోల్చిన వైద్యురాలి వీడియో వైరల్
- అర్ధరాత్రి కూడా మందులు సులభంగా లభించడంపై ప్రస్తావన
- వైద్య సేవల్లో భారత్‌కు ఉన్న సౌలభ్యాన్ని వివరించిన డాక్టర్

3

## కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

- దేశవ్యాప్తంగా కులగణనను తప్పనిసరి చేయాలని డిమాండ్
- ప్రతి కులానికి ప్రత్యేక కోడ్‌తోనే జనగణన చేపట్టాలి
- ఓబీసీలు, జనరల్ వర్గాలకు ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలి
- శాస్త్రీయ విధానం లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా
- డిమాండ్లు పట్టించుకోకుంటే దేశవ్యాప్త ఉద్యమం

2






## నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

- వరద బాధితుల ఆచూకీ కోసం కేంద్రంతో తెలంగాణ భవన్ నిరంతర సంప్రదింపులు
- సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- టిబెట్ నుంచి నేపాల్ మీదుగా భారతీయుల తరలింపు
- తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం
- డీఎన్‌ఏ కోసం కుటుంబ సభ్యులు నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి

3

## ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ

# ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వారు హిందువులు కాదంటూ న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రపంచం ముందు ఒకలా, తమ కార్యకర్తలకు మరోలా మాట్లాడటం పాత వ్యూహమని ఆరోపిస్తూ ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.

**పాత సిద్ధాంతాలేంటని ప్రశ్న**

ఆర్ఎస్ఎస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని ఒవైసీ పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ గాంధీజీ నాయకత్వంలోని హిందూముస్లిం ఐక్యతను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారని, ఆ విషయాన్ని ఆర్ఎస్ఎస్ ప్రచురించిన ఆయన జీవిత చరిత్రలోనే పేర్కొన్నారని తెలిపారు.

**గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ**

ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఒవైసీ ఆరోపించారు. 1940లో ఎం.ఎస్. గోల్వాల్కర్ ఒకే జెండా, ఒకే నాయకుడు, ఒకే సిద్ధాంతం గురించి పేర్కొన్నారని తెలిపారు. గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లోని 'ఇంటర్నల్ త్రెట్స్' అధ్యాయాన్ని ప్రస్తావిస్తూ ముస్లింలు, క్రైస్తవులను దేశానికి ముప్పులుగా పేర్కొన్నారని విమర్శించారు.

**తియ్యటి మాటలు మానాలని డిమాండ్**

ఉమ్మడి పౌరస్మృతి, మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి అంశాలను ప్రస్తావిస్తూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఒవైసీ ఆరోపించారు. 2002 గుజరాత్ అల్లర్లలో ముస్లింలపై జరిగిన హింసను కూడా ప్రస్తావించారు. భగవత్ బయటకు తియ్యటి మాటలు చెప్పడం మానుకుని హెడ్గేవార్, గోల్వాల్కర్, సావర్కర్ రచనల్లోని అంశాలను ప్రజలకు బహిరంగంగా చదివి వినిపించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అసలు సిద్ధాంతాన్ని ప్రజలు అప్పుడే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు.




## కులగణనలో ప్రతి కులానికి

# యూనిక్ కోడ్

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా యూనిక్ కోడ్ కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం వచ్చే వరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'జనగణనలో కులగణన-ప్రతి కులానికి యూనిక్ కోడ్' ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహించారు. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

**ప్రత్యేక కోడ్‌తోనే గణన**

ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ విధానం కాదని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలో ఓబీసీలు, జనరల్ వర్గాలకు కూడా ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**సదస్సుకు పలువురు నేతలు**

రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**

శాస్త్రీయ ప్రణాళిక లేకుండా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని ప్రొఫెసర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు.

ప్రతి కులాన్ని కచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని కేంద్రం తక్షణమే అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2022లో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 400 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. 14.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన వంతెనపై పాదచారుల కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు.

**ఏడాది పొడవునా రాకపోకలు**

వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట్-మూసారాంబాగ్ మధ్య అన్ని కాలాల్లో రాకపోకలకు అవకాశం కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఏర్పడే నీటి ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.రెండు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ ప్రయాణం అందుబాటులోకి రానుంది.

**కమిషనర్ కర్ణన్ సమీక్ష**

మూసారాంబాగ్ వంతెనతో పాటు నల్గొండ ఫ్లైఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్



ఆర్వీ. కర్ణన్ ఆదివారం తనిఖీ చేశారు. రెండు ప్రాజెక్టుల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**చంచల్‌గూడ ఫ్లైఓవర్ పనులు**

చంచల్‌గూడ ఫ్లైఓవర్ ప్రధాన నిర్మాణం పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ప్రారంభోత్సవానికి మార్గం సుగమం చేసేలా ఏ4 అప్ ర్యాంప్ పనులను ఆదివారమే పూర్తి చేయాలని ఆదేశించారు. చంపాపేట్ వైపు వెళ్లే ఏ3 సైడ్ ర్యాంప్ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ ఆస్పత్రి, కంచన్‌బాగ్, చంపాపేట్, సాగర్ రోడ్ మార్గాల్లో ప్రయాణించే వారికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని కర్ణన్ తెలిపారు.

# వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో కీలక మైలురాయని రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాకుండా తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించబడిందని పేర్కొన్నారు.

ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందని ఆరోపించారు.

**ప్రజలకు చేరువైన పాలన**

మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు కూడా గత పాలనలో విలువ లేకుండా పోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సచివాలయాన్ని ప్రజలకు దూరం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటోందని, మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారని, శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు.

**సంక్షేమానికి పెద్దపీట**

ప్రజాస్వామ్య పునరుద్ధరణతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల రంగంలో కీలక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన లక్షలాది కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు. రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు,



వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**

సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణలో సాధించిన పురోగతి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని తెలిపారు.

అయినప్పటికీ భారీ రుణాలు, వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు అభివృద్ధికి పెట్టుబడులను పెంచామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కుటుంబ పాలనకు ముగింపు**

బీఆర్ఎస్‌కు ఆందోళనలు చేసే స్వేచ్ఛ ఉండటమే తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందనడానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అయితే తమ వెయ్యి రోజుల ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు చెరిపివేయలేవని స్పష్టం చేశారు. కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు తెలంగాణ నిర్ణయాత్మకంగా అడుగులు వేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా పచ్చని, ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా మలచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.

ఆదివారం ప్రజాభవన్‌లో కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి వన మహోత్సవం పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

జిల్లాల వారీగా మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**లక్ష్యానికి చేరువగా**

ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు.

గుంతల తవ్వకంలో 92 శాతం, మొక్కలు నాటడంలో 91 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీతక్క.. వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**మొక్కల సంరక్షణే ముఖ్యం**

మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు. వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

నాటిన ప్రతి మొక్క మనుగడ సాధించేలా గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

**కుటుంబ ఆరోగ్యానికి పండ్ల మొక్కలు**

పండ్ల కోసం మార్కెట్లపైనే ఆధారపడకుండా ఇంటి ఆవరణలోనే పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సీతక్క సూచించారు.

మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు స్వచ్ఛమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి మొక్కలను ఇళ్ల వద్ద పెంచుకోవడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు పోషకాహారం కూడా లభిస్తుందని తెలిపారు.

పంపిణీ చేసిన మొక్కలు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను ఇంటి సభ్యుడిలా ప్రేమగా పెంచుకుంటూ పచ్చని గ్రామాలకు, ఆరోగ్యకరమైన సమాజానికి ప్రజలంతా బలమైన పునాది వేయాలని మంత్రి సీతక్క కోరారు.

# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ఉభయ సభల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు.

సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అధికారులు సభ్యులకు సమాచారం అందించారు.

**సీఎం ముందే ప్రకటన**

వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కార్యదర్శి సమావేశాల ప్రారంభ తేదీని అధికారికంగా వెల్లడించారు.

**బీఆర్ఎస్ పాలనపై చర్చకు సవాల్**

గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

ఈ చర్చలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

**పలు అంశాలపై చర్చ**

ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, వివిధ సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.

సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాజకీయాల్లో ప్రచార పోరు కొత్త రూపు సంతరించుకుంటోంది. బీఆర్ఎస్ డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వంపై విమర్శలను విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం క్షేత్రస్థాయి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కంటే ప్రజలను నేరుగా కలవడం, బహిరంగ సభలు, జిల్లాల పర్యటనల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంపైనే దృష్టి సారిస్తున్నారు.

**డిజిటల్‌లో కాంగ్రెస్ వెనుకంజ**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఉన్నంత బలమైన సామాజిక మాధ్యమ వ్యవస్థ కాంగ్రెస్‌కు లేకపోవడం రాజకీయంగా ప్రతికూలంగా మారుతోంది. గత పదేళ్లలో బీఆర్ఎస్ నిర్మించుకున్న డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వంపై విమర్శలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతోంది. దీనికి సమర్థంగా దీటైన ప్రచార వ్యవస్థను కాంగ్రెస్ ఇంకా నిర్మించుకోవాల్సి ఉంది. ఈ లోటును రేవంత్ రెడ్డి తన పర్యటనలు, బహిరంగ సభలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలవడం ద్వారా ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో మద్దతు పెంచుకోవాలని భావిస్తున్నారు.

**మాస్ ప్రసంగాలతో రాజకీయ వేడి**

రేవంత్ రెడ్డి ప్రసంగాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కావడం లేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు, ఘాటు వ్యాఖ్యలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలు చేయిస్తున్నారంటూ చేసిన ఆరోపణలు, సొంత పార్టీ నేతలపైనే తీవ్రంగా వ్యవహరిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

ఇలాంటి వ్యాఖ్యలు ప్రసంగ వేదికలకే పరిమితం కాకుండా టీవీ చర్చలు, యూట్యూబ్ వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. దీంతో ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి తనదైన రీతిలో సమాధానం ఇవ్వడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ చర్చను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామీణ ప్రాంతాలపై దృష్టి**

బీఆర్ఎస్ డిజిటల్ ప్రచారం పట్టణ ప్రాంతాలు, యువత, విద్యావంతులైన ఓటర్లలో ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ.. తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో నాయకుడి ప్రత్యక్ష హాజరు, స్థానిక కార్యకర్తలతో అనుసంధానం, ప్రజలతో ముఖాముఖి సంబంధాలు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఇదే అంశాన్ని తన రాజకీయ వ్యూహంలో ప్రధానంగా మలుచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలకు వెళ్లి సభల్లో మాట్లాడటం, స్థానిక సమస్యలను ప్రస్తావించడం, ప్రతిపక్షంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది.

**వ్యూహంలో ముప్పులూ ఉన్నాయి**

అయితే రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఘాటు వ్యాఖ్యల వ్యూహానికి ప్రతికూలతలు కూడా లేకపోలేదు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన చర్చగా మారితే.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరు వంటి అసలు అంశాలు వెనుకబడే అవకాశం ఉంది. మరోవైపు రేవంత్ ప్రసంగాల్లోని వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ డిజిటల్ బృందం చిన్న వీడియోలుగా మార్చి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోంది.

**ఆన్‌స్క్రీన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో కాంగ్రెస్**

ప్రస్తుతం తెలంగాణలో ప్రచార పోరును చూస్తే బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా వ్యవహరిస్తుండగా.. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ కేవలం ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆధారపడకుండా తన డిజిటల్ వ్యవస్థను కూడా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎన్నికల రాజకీయాల్లో సామాజిక మాధ్యమాల ప్రచారం వేగంగా ప్రభావం చూపించినా.. ప్రజలను నేరుగా కలుసుకోవడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ సంబంధాలను బలోపేతం చేయడం దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అంశాలుగా నిలుస్తాయి. దీంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ డిజిటల్ దాడికి దీటుగా రేవంత్ రెడ్డి తన ప్రత్యక్ష రాజకీయ దూకుడును అస్త్రంగా మలుచుకుంటున్నారని చెప్పవచ్చు.

# రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

**రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకే**

హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని అజామాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ సంస్థకు చెందిన 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని హరీశ్ రావు తెలిపారు.

15,984 గజాల విస్తీర్ణంలోని ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.500 కోట్ల విలువ చేస్తుందని పేర్కొన్నారు.

అలాంటి విలువైన భూమిని కేవలం రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు.

రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని పక్కనబెట్టి ప్రైవేటు వ్యక్తికి భూమిని కట్టబెట్టడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును విస్మరణ**

1987లో ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు గుర్తుచేశారు.

ఆ భూమిపై పూర్తి హక్కు ప్రభుత్వానిదేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎలాంటి ప్రైవేటు శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడామని పేర్కొన్నారు. ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మరోవైపు కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలి, అజామాబాద్‌లోని ఖరీదైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు.

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**

స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను ఇలాగే విక్రయిస్తూ పోతే భవిష్యత్తులో బడికి, గుడికి, చివరకు స్మశానానికి కూడా స్థలం మిగలదని హరీశ్ రావు హెచ్చరించారు.

అజామాబాద్ భూముల కేటాయింపును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి ఫ్రీ హోల్డ్ హక్కులను ఆయిల్‌ఫెడ్‌కే కల్పించాలని కోరారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు న్యాయపోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ మహా పోరాటం చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



**భారతీయుల తరలింపు**

భారత విదేశాంగ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఆగస్టు 29న టిబెట్ నుంచి నేపాల్‌కు 449 మంది భారతీయులు చేరుకున్నారు. ఆగస్టు 30న మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పేరు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయన పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదు**

నేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, ఖాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగితే డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపారు. మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాలను పరిశీలించిన అనంతరం పార్థివదేహాన్ని సంబంధిత కుటుంబానికి అప్పగించనున్నారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు వంటి తొలి స్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చనున్నారు. ఇందుకోసం బంధువులు నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు రూపొందిస్తున్నారు.

**అధికారిక నిర్ధారణ తర్వాతే సమాచారం**

పార్థివదేహాల గుర్తింపు, కుటుంబాలకు అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన పూర్తి విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులు స్వయంగా నేపాల్‌కు వెళ్లకుండా తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తర్వాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం అందిస్తామని అధికారులు వెల్లడించారు.

# NEET-PGలో 15 శాతం AIQ చేయాలి

- 50 శాతం ఆల్ ఇండియా కోటాను తగ్గించాలని వినోద్ కుమార్ లేఖ
- తెలంగాణలో పెరిగిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, పీజీ సీట్లు
- రాష్ట్ర నిధులతో ఏర్పాటైన సీట్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- AIQ కింద రాష్ట్రాల వారీగా పారదర్శక గణాంకాలు విడుదల చేయాలి
- సమతుల్య సమాఖ్య విధానం అవసరమని కేంద్రానికి సూచన

హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

NEETPGలో ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటా (AIQ)ను 15 శాతానికి తగ్గించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన NEETPG పరీక్ష సందర్భంగా తెలంగాణ వైద్య విద్యార్థులు, వైద్యుల నుంచి అందిన సమాచారం, వారి ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.



**రాష్ట్ర నిధులతో వైద్య విద్య**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాల వారీగా పలు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందని వినోద్ కుమార్ తెలిపారు. వైద్య విద్యతో పాటు పీజీ సీట్ల సంఖ్యను కూడా గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. ఈ వైద్య కళాశాలలు, సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగిస్తున్నందున వాటిలో అధిక భాగం తెలంగాణ వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విధానం రూపొందించాలని కోరారు.

**AIQలో సమతుల్యత అవసరం**

NEETUGలో 15 శాతం AIQ అమల్లో ఉండగా, NEETPGలో 50 శాతం AIQ కొనసాగడం సమతుల్యంగా లేదని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. పీజీ వైద్య విద్యలోనూ AIQను 15 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**రాష్ట్రాల వారీగా గణాంకాలు**

ప్రతి రాష్ట్రం నుంచి AIQకు ఎన్ని ప్రభుత్వ పీజీ సీట్లు వెళ్తున్నాయి, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతమంది విద్యార్థులు ఆయా సీట్లను పొందుతున్నారనే వివరాలను రాష్ట్రాల వారీగా పారదర్శకంగా వెల్లడించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రస్తుత AIQ విధానంపై సమగ్ర సమీక్ష నిర్వహించి, రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

**సమాఖ్య విధానం అవసరం**


ఈ డిమాండ్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ ప్రజా నిధులతో అభివృద్ధి చేస్తున్న వైద్య విద్యా మౌలిక వసతులకు అనుగుణంగా పీజీ సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు సముచిత వాటా లభించేలా సమతుల్యమైన సమాఖ్య విధానం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

# భారత వైద్య వ్యవస్థపై విదేశీ అనుభవంతో డాక్టర్ ప్రశంసలు

- బ్రిటన్‌తో పోల్చిన వైద్యురాలి వీడియో వైరల్
- అర్ధరాత్రి కూడా మందులు సులభంగా లభించడంపై ప్రస్తావన
- వైద్య సేవల్లో భారత్‌కు ఉన్న సౌలభ్యాన్ని వివరించిన డాక్టర్
- భారత వైద్య వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ
- వీడియోపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నెటిజన్లు

హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో వైద్య సేవల లభ్యతను పోలుస్తూ భారతీయ వైద్యురాలు డాక్టర్ దీపాంజలి శర్మ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాత్రివేళ తన భర్తకు అకస్మాత్తుగా అనారోగ్యం రావడంతో మందులు, ఐవీ ఇంజెక్షన్ల కోసం బయటకు వెళ్లిన ఆమె.. ఆ సమయంలో భారత్‌లో ఉండటం ఎంత సౌకర్యంగా ఉందో వివరించారు.



**రాత్రి వేళ మందుల కోసం బయటకు**

డాక్టర్ శర్మ భర్త కూడా వైద్యుడే. ఆయనకు తొలుత తలనొప్పి రావడంతోపాటు వరుసగా వాంతులు కావడంతో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మందుల కోసం బయటకు వెళ్లారు. అవసరమైన మందులు, ఐవీ ఇంజెక్షన్లు తీసుకుని తిరిగి ఇంటికి చేరుకునే అవకాశం భారత్‌లో ఉండటం తనకు గొప్ప విషయంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు.

**పాశ్చాత్య దేశాల్లో భిన్న పరిస్థితులు**

బ్రిటన్‌తో పాటు ఇతర పాశ్చాత్య దేశాల్లో సాధారణ పని వేళలు దాటిన తర్వాత అత్యవసర వైద్య సహాయం, కొన్ని మందులు పొందడం కష్టంగా ఉంటుందని డాక్టర్ శర్మ తెలిపారు. అత్యవసర విభాగాల్లో ఇప్పటికే రద్దీ, ఒత్తిడి ఉండటంతో వెంటనే వైద్య సహాయం అందడం కష్టమయ్యే అవకాశం ఉందన్నారు. మందులు కూడా వెంటనే లభించకపోవచ్చని చెప్పారు.

**భారత్‌లో సౌలభ్యమే బలమని వ్యాఖ్య**

భారత్‌లో అర్ధరాత్రి అయినా బయటకు వెళ్లి అవసరమైన మందులు తీసుకొచ్చి, తిరిగి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యుడిని చూసుకునే అవకాశం ఉండటాన్ని ఆమె ప్రస్తావించారు. 24 గంటల ఫార్మసీలు, అందుబాటులో ఉండే వైద్య సేవలు భారత వైద్య వ్యవస్థకు ఉన్న సౌలభ్యాన్ని చూపుతున్నాయని చెప్పారు.

**లోపాలు లేవని చెప్పడం లేదని స్పష్టీకరణ**

భారత వైద్య వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని తాను చెప్పడం లేదని డాక్టర్ శర్మ స్పష్టం చేశారు. ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని, ఏ దేశంలోనూ వైద్య సేవలు పూర్తిగా పరిపూర్ణంగా ఉండవని పేర్కొన్నారు. అయితే భారత్‌లో సాధారణ ప్రజలకు వైద్య సేవలు, మందులు సులభంగా అందుబాటులో ఉండటం ఒక ప్రత్యేకతగా అభిప్రాయపడ్డారు.

**నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు**

డాక్టర్ శర్మ వీడియోపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. భారత్‌లో 24 గంటల ఫార్మసీలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మందులు త్వరగా పొందగలుగుతున్నామని పలువురు పేర్కొన్నారు. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మందులు సులభంగా లభించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఇక క్రాస్ వాల్యుయేషన్

హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థుల జవాబు పత్రాలను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కాకుండా ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించే క్రాస్ వాల్యుయేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.



**నిష్పక్షపాత మూల్యాంకనం**

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA1, SA2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు 10వ తరగతి SA1 పరీక్ష పేపర్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు దిద్దరు. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు వాటిని అప్పగించి మూల్యాంకనం చేయిస్తారు.

తమ వద్ద చదివే విద్యార్థుల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దే సమయంలో మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు జరిగే అవకాశం ఉంటుంది. క్రాస్ వాల్యుయేషన్ ద్వారా ఇలాంటి పక్షపాతానికి అడ్డుకట్ట వేసి, సమాధానాల ఆధారంగా ప్రామాణిక మార్కులు కేటాయించే అవకాశం ఉంటుంది.

**మండల కేంద్రాల్లో కేంద్రాలు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి.

ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించి జవాబు పత్రాల దిద్దుబాటు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

**విద్యా సామర్థ్యంపై స్పష్టత**

నిష్పక్షపాతంగా వెలువడే ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి అసలైన విద్యా సామర్థ్యాన్ని గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ఏయే అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఈ ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్రాస్ వాల్యుయేషన్ విధానం దోహదపడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.



# తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహాలు

హైదరాబాద్, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

గోదావరి పుష్కరాలు అంటే రాజమహేంద్రవరం పేరు గుర్తుకొచ్చే పరిస్థితిని మార్చి, ఇకపై తెలంగాణతో గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అనుబంధం ఏర్పడేలా వచ్చే ఏడాది ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు' అనేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

**రూ.1,000 కోట్లతో ఏర్పాట్లు**


2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు పరిచయమయ్యేలా వసతులు కల్పించాలని సురేఖ సూచించారు. పుష్కర ఘాట్లు, భక్తుల రాకపోకలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని చెప్పారు.

**సమన్వయానికి ప్రత్యేక కార్యాలయం**

గోదావరి పుష్కరాలు2027 పనుల సమన్వయం కోసం ప్రజాభవన్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.




# నీట్ పీజీ పరీక్షలో కలకలం

- సెక్యూరిటీ దాటుకుని మద్యం మత్తులో హాజరు
- పరీక్ష హాల్‌లో విద్యార్థి తీరుపై సిబ్బందికి అనుమానం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిన వేళ రంగారెడ్డి జిల్లాలో ఓ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష రాసేందుకు రావడం కలకలం రేపింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్ష కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ మద్యం సేవించి పరీక్షకు హాజరైనట్లు గుర్తించారు.

**సెక్యూరిటీ దాటుకుని పరీక్ష హాల్‌లోకి**

రిజ్వాన్ సాధారణ తనిఖీలను దాటుకుని పరీక్ష హాల్‌లో తన సీటు వరకు వెళ్లాడు. అయితే అతడి ప్రవర్తనలో తేడా కనిపించడంతోపాటు మద్యం వాసన రావడంతో పరీక్ష సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో అతడిని వెంటనే బయటకు పంపి మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష**

మరోసారి నిర్వహించిన తనిఖీలో రిజ్వాన్ మద్యం సేవించి వచ్చినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సెక్యూరిటీపై ప్రశ్నలు**

నీట్ పీజీ వంటి కీలక పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష హాల్ వరకు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే ముందు తనిఖీల తీరుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# నార్త్ సైప్రస్ తీరంలో ఫెర్రీ బోల్తా

- వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు
- ప్రయాణికుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రాణనష్టంపై ఇంకా అధికారిక సమాచారం లేదు

కైరేనియా, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:

నార్త్ సైప్రస్ తీరంలో ఆదివారం సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫెర్రీ సముద్రంలో బోల్తాపడింది. నౌకలోకి ఒక్కసారిగా నీరు చేరడంతో ప్రమాదం జరిగినట్లు టర్కిష్ సైప్రియట్, టర్కీ మీడియా సంస్థలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రాణనష్టం జరిగినట్లు అధికారిక సమాచారం లేదు.

**మార్గమధ్యంలో నీరు చేరడంతో**

కాటమరాన్ తరహా ఫెర్రీ నార్త్ సైప్రస్‌లోని కైరేనియా పోర్టు నుంచి టర్కీలోని మెర్సిన్ ప్రావిన్స్‌లోని తసూకు పోర్టుకు బయలుదేరింది. తీరానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండగా నౌకలోకి నీరు చేరడం ప్రారంభమైంది. దీంతో కొద్దిసేపటికే ఫెర్రీ అదుపుతప్పి సముద్రంలో బోల్తాపడినట్లు టర్కీ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది.

**మంత్రి ధ్రువీకరణ**

ఫెర్రీ ప్రమాదానికి గురైన విషయాన్ని నార్త్ సైప్రస్ రవాణా మంత్రి ఎర్హాన్ అరిక్లీ ధ్రువీకరించారు. ప్రమాద ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

ప్రమాదం అనంతరం ప్రయాణికులను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంతమందిని రక్షించారు, ప్రయాణికుల పరిస్థితి ఏమిటన్న వివరాలను అధికారులు వెల్లడించలేదు.





# 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ పూర్తి చేసిన నారాయణపేట ఎస్పీ

- **"ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి"**

**నారాయణపేట, ఆగస్టు 30 (ఆశ్వి అప్డేట్స్):**

హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS, డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ విజయవంతంగా పూర్తి చేశారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మారథాన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, యువత, క్రీడాకారులు, ఫిట్‌నెస్ ప్రియులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ పోలీసు విధుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కొంత సమయం వ్యాయామం, రన్నింగ్, సైక్లింగ్, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు కేటాయించాలని సూచించారు. పోలీసు శాఖలో అధికారులు, సిబ్బంది ఫిట్‌గా ఉండేందుకు జిల్లాలో లాంగ్ రన్నింగ్, సైక్లింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నారాయణపేట జిల్లా యువత, విద్యార్థులు కూడా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇచ్చి క్రీడల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటేనే రోజువారీ పనులను మరింత ఉత్సాహంతో, సమర్థవంతంగా నిర్వహించగలమని ఎస్పీ పేర్కొన్నారు. 21 కిలోమీటర్ల మారథాన్‌ను పూర్తి చేయడం ద్వారా ఆయన ఫిట్‌నెస్‌పై తన నిబద్ధతను చాటిచెప్పడంతో పాటు పోలీసు సిబ్బంది, యువతకు స్ఫూర్తిగా నిలిచారు.




# గంజాయి అక్రమ రవాణా, విక్రయం.. ఇద్దరి అరెస్ట్

- **430 గ్రాముల గంజాయి, బైక్, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**జగదేవ్‌పూర్, ఆశ్వి అప్డేట్స్:**

గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని జగదేవ్‌పూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 430 గ్రాముల గంజాయి, GIXXER ద్విచక్ర వాహనం, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ శివారులోని గజ్వేల్ రోడ్డులో భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని పోలీసులు గుర్తించారు. పోలీసులను గమనించిన వారు తప్పించుకునేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. బైక్ సీటు కింద ప్లాస్టిక్ కవర్లలో దాచిన 430 గ్రాముల గంజాయి లభించింది. అరెస్టయిన వారిని దేవుని కొజ్జ నవీన్ కుమార్ (25), మునిగడప, చీలసాగర్ పవన్ కళ్యాణ్ (26), జగదేవ్‌పూర్, ప్రస్తుతం కొంపల్లి, హైదరాబాద్గా పోలీసులు గుర్తించారు. విచారణలో ఒడిశా రాష్ట్రంలోని సీలేరు సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి కొంత వినియోగించడంతో పాటు, మిగిలినదాన్ని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.
నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి సేవించడం, అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని సూచించారు.




# పద్మా దేవేందర్‌రెడ్డి పాదయాత్రపై కాంగ్రెస్ నేతల కౌంటర్

- **పదేళ్ల పాలనలో అభివృద్ధి చేయకుండా ఇప్పుడు పాదయాత్ర ఎందుకని ప్రశ్న**

**నిజాంపేట, ఆశ్వి అప్డేట్స్:**

మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రపై నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన పద్మా దేవేందర్‌రెడ్డి నిజాంపేట మండలానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పాదయాత్రకు 16 గ్రామపంచాయతీల్లో కేవలం కొన్ని గ్రామాల ప్రజలు మాత్రమే హాజరయ్యారని, ఇతర మండలాల నుంచి కార్యకర్తలను తరలించి పాదయాత్ర నిర్వహించారని వారు ఆరోపించారు. నందగోకుల్-చల్మెడ రోడ్డు కోసం గతంలో రూ.13 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. గతంలో ఇచ్చిన నిధులు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులపై ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రానున్న రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో చల్మెడ కమాన్ నుంచి నందగోకుల్ వరకు రోడ్డు పనులను ప్రారంభిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, నసీరుద్దీన్, లింగం గౌడ్, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# భారత్–ఉజ్బెకిస్థాన్ భాగస్వామ్యానికి నూతన ఊపు

- **తాష్కెంట్‌లో అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో కీలక చర్చలు**

**తాష్కెంట్, ఆశ్వి అప్డేట్స్:**

భారత్-ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలకు మరింత బలమైన పునాది వేస్తూ తాష్కెంట్‌లో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో కీలక చర్చలు జరిగాయి. ఇరు దేశాల మధ్య ఇప్పటికే కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలను మరింత విస్తరించడంతో పాటు, భవిష్యత్ సహకారానికి కొత్త దిశానిర్దేశం చేయడంపై చర్చలు జరిగినట్లు వెల్లడైంది. భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలకు ఆధునిక ఆర్థిక, వ్యూహాత్మక సహకారం తోడవుతోంది. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి చర్చలు ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశాలను పెంచాయి.

**వాణిజ్యం, పెట్టుబడులపై దృష్టి**

ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం, వ్యాపార సంస్థల మధ్య పరస్పర సహకారాన్ని పెంచడం వంటి అంశాలు కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా మౌలిక వసతులు, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో సహకారానికి మరిన్ని అవకాశాలను అన్వేషించే దిశగా చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**సాంకేతికత, డిజిటల్ రంగాల్లో సహకారం**

డిజిటల్ టెక్నాలజీ, ఆవిష్కరణలు, ఐటీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో భారత్ సాధించిన పురోగతిని ఉజ్బెకిస్థాన్‌తో పంచుకునే అవకాశాలు ఇరు దేశాల భాగస్వామ్యానికి కొత్త బలాన్ని ఇవ్వనున్నాయి. డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారం మరింత విస్తరించే అవకాశం ఉంది.

**విద్య, ఆరోగ్యం, ప్రజల మధ్య సంబంధాలు**

విద్య, వైద్యం, ఫార్మాస్యూటికల్స్, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి వంటి ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే రంగాల్లో సహకారాన్ని పెంచడంపైనా దృష్టి సారించారు. విద్యార్థులు, పరిశోధకులు, నిపుణులు, వ్యాపారవేత్తల పరస్పర పర్యటనలు రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నాయి.

**ప్రాంతీయ, వ్యూహాత్మక సహకారం**

మధ్య ఆసియా ప్రాంతంలో ఉజ్బెకిస్థాన్ కీలక స్థానంలో ఉండటంతో భారత్‌కు ఆ దేశంతో సంబంధాలు వ్యూహాత్మకంగా కూడా ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. ప్రాంతీయ అనుసంధానం, భద్రత, ఉగ్రవాదం-మాదకద్రవ్యాల నియంత్రణ, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అంతర్జాతీయ అంశాలపై సహకారం పెంపొందించుకునే అవకాశాలు ఉన్నాయి. తాష్కెంట్‌లో జరిగిన తాజా చర్చలు కేవలం ద్వైపాక్షిక సంబంధాలకే పరిమితం కాకుండా వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, విద్య, పెట్టుబడులు, ప్రాంతీయ భద్రత వంటి అనేక రంగాల్లో భారత్-ఉజ్బెకిస్థాన్ భాగస్వామ్యాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా కీలక అడుగుగా నిలిచాయి. ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న స్నేహబంధాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మరింత విస్తరించేందుకు ఈ చర్చలు తాజా ప్రేరణనిచ్చాయని భావిస్తున్నారు.

# సాంకేతికతే పోలీసింగ్‌కు కొత్త ఆయుధం!

- **ఏఐ నుంచి డిజిటల్ దర్యాప్తు వరకు.. తెలంగాణ పోలీసింగ్‌లో సరికొత్త మార్పులు**
- **యువ ఐపీఎస్‌ల ఆలోచనలకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రోత్సాహం.. శిక్షణ, సాంకేతికత, సమన్వయంతో నేరాలపై ఉక్కుపాదం**

**హైదరాబాద్, ఆగస్టు 30 | ఆశ్వి ప్రత్యేక కథనం:**



నేరం మారుతోంది.. నేరస్థుల ఆలోచనా విధానం మారుతోంది.. సాంకేతిక పరిజ్ఞానం నేరాలకు కొత్త మార్గాలను చూపుతున్న వేళ పోలీసింగ్ కూడా అదే స్థాయిలో ఆధునికంగా మారాల్సిన అవసరం ఏర్పడింది. ఈ మార్పును తెలంగాణ పోలీస్ శాఖ వేగంగా అందిపుచ్చుకుంటోంది. సంప్రదాయ పోలీసింగ్‌కు ఆధునిక సాంకేతికతను జోడిస్తూ నేర నియంత్రణలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది.
ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ చేసిన సూచనలు తెలంగాణ పోలీసింగ్ భవిష్యత్ దిశను స్పష్టం చేస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), డేటా ఆధారిత నేర విశ్లేషణ, డిజిటల్ దర్యాప్తు, ఈఫోరెన్సిక్, ఈసాక్ష్య, సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ వంటి వ్యవస్థలను మరింత సమర్థంగా వినియోగించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**నేరం డిజిటల్ అయితే.. పోలీసింగ్ కూడా డిజిటల్‌గానే!**

ఒకప్పుడు నేరం జరిగిన తర్వాత దర్యాప్తు ప్రారంభమయ్యేది. ఇప్పుడు పరిస్థితి మారింది. నేరం జరగకముందే అనుమానాస్పద ధోరణులను గుర్తించడం, డేటాను విశ్లేషించడం, నేరాల నమూనాలను అంచనా వేయడం ఆధునిక పోలీసింగ్‌లో కీలకంగా మారింది.
సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ వంటి వ్యవస్థలు వివిధ పోలీస్ విభాగాల మధ్య సమాచార మార్పిడికి కీలకంగా మారుతున్నాయి. ఈ డిజిటల్ వ్యవస్థలను నిరంతరం అప్‌డేట్ చేయడం ద్వారా నేరస్థుల కదలికలు, గత నేర చరిత్ర, కేసుల పురోగతి వంటి అంశాలపై వేగంగా సమాచారం పొందే అవకాశం ఉంటుంది.

**ఏఐ.. పోలీసులకు కొత్త బలం**

కృత్రిమ మేధ వినియోగం భవిష్యత్ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించనుంది. నేరాల విశ్లేషణ నుంచి పర్యవేక్షణ వరకు ఏఐ ఆధారిత పరిష్కారాలు పోలీసుల సామర్థ్యాన్ని మరింత పెంచగలవు.
పోలీస్ శాఖలోని అంతర్గత వ్యవస్థలను మెరుగుపరిచేందుకు ఏఐ ఆధారిత అప్లికేషన్లు రూపొందిస్తున్న యువ ఐపీఎస్ అధికారులను డీజీపీ అభినందించడం ఈ మార్పుకు ప్రాధాన్యతను తెలియజేస్తోంది.
యువ అధికారుల ఆలోచనలు.. సీనియర్ అధికారుల అనుభవం.. ఆధునిక సాంకేతికత.. ఈ మూడు కలిస్తే భవిష్యత్ పోలీసింగ్ మరింత శక్తివంతంగా మారే అవకాశం ఉంది.

**కోర్టు కేసులు.. దర్యాప్తు తర్వాత అసలు పరీక్ష**

కేసు నమోదు చేయడం, నిందితుడిని అరెస్టు చేయడం మాత్రమే పోలీసుల బాధ్యత కాదు. న్యాయస్థానంలో కేసు నిలబడేలా పకడ్బందీ దర్యాప్తు, ఆధారాల సేకరణ, న్యాయపరమైన ప్రక్రియలను పాటించడం కూడా అంతే ముఖ్యం. ఈ అంశంపైనే డీజీపీ ప్రత్యేక దృష్టి సారించారు. కోర్టు కేసుల పురోగతిని సమర్థంగా పర్యవేక్షించడంతో పాటు దర్యాప్తు అధికారులు, సిబ్బందికి న్యాయపరమైన అంశాలపై నిరంతర శిక్షణ అవసరమని స్పష్టం చేశారు.

**శిక్షణ లేకుండా ఆధునిక పోలీసింగ్ సాధ్యం కాదు**

సాంకేతికత అందుబాటులోకి వచ్చినంత మాత్రాన దాని ప్రయోజనం పూర్తిగా పొందలేం. దానిని వినియోగించే సిబ్బందికి తగిన నైపుణ్యం ఉండాలి. అందుకే జిల్లా శిక్షణ కేంద్రాలు, నగర శిక్షణ కేంద్రాలు, పోలీస్ శిక్షణ కళాశాలలు, బెటాలియన్లు, పోలీస్ అకాడమీల్లో మారుతున్న నేర ధోరణులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని డీజీపీ సూచించారు. నిరంతర శిక్షణ ద్వారా పోలీసుల విశ్లేషణ సామర్థ్యం, దర్యాప్తు నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతాయి. ఫలితంగా కేసుల పరిష్కార సామర్థ్యం కూడా మెరుగుపడుతుంది.

**క్లస్టర్లలో ఉత్తమ ప్రతిభ**

నేర నియంత్రణకు సంబంధించిన వివిధ ప్రమాణాల అమలులో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ విభాగాలను డీజీపీ అభినందించారు. క్లస్టర్-1లో హైదరాబాద్, క్లస్టర్-2లో రామగుండం, క్లస్టర్-3లో నల్గొండ, క్లస్టర్-4లో సూర్యాపేట ప్రథమ స్థానాల్లో నిలిచాయి.

**ఆశ్వి తెలుగు దినపత్రిక ప్రత్యేక కథనం**

ఇది కేవలం ర్యాంకింగ్ మాత్రమే కాదు. క్షేత్రస్థాయిలో పోలీసింగ్ ప్రమాణాలను మెరుగుపరచడానికి పోటీ వాతావరణం ఏర్పడటానికి కూడా ఇది దోహదపడుతుంది.

**సమన్వయమే విజయానికి కీలకం**

నేటి నేరాలకు జిల్లా సరిహద్దులు ఉండటం లేదు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల రవాణా, ఆన్‌లైన్ మోసాలు వంటి నేరాలు రాష్ట్రాలు, దేశాల సరిహద్దులను దాటి సాగుతున్నాయి.
అందువల్ల పోలీస్ విభాగాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయం అత్యంత కీలకం. సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా అనుసంధానం చేసి, డేటాను వేగంగా పంచుకోవడం ద్వారా నేర నియంత్రణ మరింత సమర్థవంతంగా మారుతుంది.

**ప్రజల నమ్మకమే అసలు లక్ష్యం**

ఆధునిక పోలీసింగ్ లక్ష్యం కేవలం నేరాలను అరికట్టడం మాత్రమే కాదు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందించడం కూడా.
టెక్నాలజీ ఎంత పెరిగినా పోలీసింగ్‌లో మానవీయత, బాధ్యత, నిజాయితీ, ప్రజల పట్ల గౌరవం కీలకంగానే ఉంటాయి. ఈ విలువలకు సాంకేతికతను జోడించినప్పుడే ప్రజా పోలీసింగ్ మరింత బలపడుతుంది.

**ముందున్న మార్గం.. స్మార్ట్ పోలీసింగ్**

తెలంగాణ పోలీసింగ్ ఇప్పుడు సంప్రదాయ విధానాల నుంచి స్మార్ట్, డేటా ఆధారిత, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్ వైపు వేగంగా అడుగులు వేస్తోంది.

**ఆశ్వి అప్డేట్స్ విశ్లేషణ**

నేరాల స్వరూపం మారుతున్నప్పుడు పోలీసింగ్ మారక తప్పదు. సాంకేతికత పోలీసుల చేతిలో ఒక సాధనం మాత్రమే.. దానిని ప్రజా భద్రత కోసం సమర్థంగా వినియోగించే నాయకత్వం, నైపుణ్యం, నిబద్ధతే అసలైన బలం. తెలంగాణ పోలీసింగ్ ఆ దిశగా వేస్తున్న అడుగులు భవిష్యత్ పోలీసింగ్‌కు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది.

ఏఐ.. డిజిటల్ దర్యాప్తు.. ఆధునిక ఫోరెన్సిక్.. నిరంతర శిక్షణ.. బలమైన నాయకత్వం.. విభాగాల మధ్య సమన్వయం..
ఈ అంశాలన్నీ కలిస్తే భవిష్యత్‌లో నేరాన్ని జరిగిన తర్వాత మాత్రమే ఛేదించే పోలీసింగ్ కాకుండా, నేరాన్ని ముందుగానే అంచనా వేసి అడ్డుకునే ప్రివెంటివ్ పోలీసింగ్ దిశగా తెలంగాణ మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. "సాంకేతికతను ఆయుధంగా.. శిక్షణను బలంగా.. ప్రజాసేవను లక్ష్యంగా చేసుకున్న పోలీసింగ్" తెలంగాణలో మరింత బలపడితే నేర నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావన కూడా పెరుగుతుంది.



**కాసోజు శంకరాచారి**
**అసోసియేట్ ఎడిటర్ | ఆశ్వి తెలుగు దినపత్రిక**





# ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజులు

- **సంక్షేమం నుంచి ప్రపంచస్థాయి అభివృద్ధి వరకు.. రైతు నుంచి యువత వరకు విస్తృత కార్యక్రమాలు**

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సమన్వయం చేస్తూ రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రయోజనం చేకూర్చే పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసింది.

రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం, సన్నవడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది.

సామాజిక న్యాయంలో భాగంగా కుల సర్వే, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యారంగంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్కిల్స్ యూనివర్సిటీ, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. మొత్తంగా 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, కొత్త మెడికల్ కాలేజీలు, టిమ్స్ ఆసుపత్రులు, నిమ్స్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. డ్రగ్స్, ఆహార కల్తీ నియంత్రణకు టీసేఫ్, మహిళలు-పిల్లల రక్షణకు షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థలను బలోపేతం చేసింది.

పరిపాలనలో ఈఆఫీస్, డిజిటల్ కేబినెట్, వాట్సాప్ ద్వారా 581కుపైగా ప్రభుత్వ సేవలు, ఏఐ డేటా ఎక్స్ఛేంజ్ వంటి సాంకేతిక సంస్కరణలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. భూభారతి, ప్రజావాణి, అభయహస్తం వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసే ప్రయత్నం చేసింది.



మౌలిక వసతుల రంగంలో రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, హ్యామ్ రోడ్లు, రేడియల్ రోడ్లు, విమానాశ్రయాల అభివృద్ధి, మూసీ పునరుజ్జీవనం వంటి భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది.

పెట్టుబడులు, ఐటీ, పరిశ్రమలు, టూరిజం రంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047కు రూపకల్పన చేసింది. ఫ్యూచర్ సిటీ, ఏఐ, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు చేపట్టింది. సంక్షేమం-సామాజిక న్యాయం-ఉపాధి-పెట్టుబడులు-మౌలిక వసతులు-డిజిటల్ పాలనను సమన్వయం చేస్తూ వెయ్యి రోజుల ప్రజాపాలన తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి పునాది వేసిందని ప్రభుత్వం వెల్లడించింది.







# సమర్ధవంతమైన నాయకుడినే డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలి

- **ఎల్బీనగర్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు పీవీ మోహన్**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నూతన డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని ఎన్‌విలేజ్ కన్వెన్షన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ పీవీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ పరిశీలకులు పటేల్ రమేష్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ పీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీ మోహన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఆర్థికంగా కీలకమైన జిల్లాగా రంగారెడ్డి ఉందని, అలాంటి జిల్లాకు పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే సమర్ధవంతమైన, అందరినీ కలుపుకొని వెళ్లే నాయకుడిని డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంతో పనిచేసే నాయకత్వానికి అవకాశం కల్పించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పై కార్యకర్తలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించాలని సూచించారు. తనకు రాజకీయ వారసులు ఎవరూ లేరని, పార్టీ నాయకులు, కార్యకర్తలే తన వారసులని స్పష్టం చేశారు.



ఎస్ఐఆర్‌లో భాగంగా నో మ్యాపింగ్‌లో ఉన్న ఓట్లకు సంబంధించి నోటీసులు అందుకునే వారికి అవసరమైన వివరాలు అందించేలా కార్యకర్తలు, బీఎల్ఏలు కృషి చేయాలని కోరారు. ఇప్పటివరకు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన చల్లా నర్సింహారెడ్డిని నాయకులు అభినందించి సన్మానించారు. పటేల్ రమేష్‌రెడ్డి, డాక్టర్ మట్టా రాగమయి, పీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే, అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకుడిని డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- **ఫాతిమా విద్యాలయం, JPNCEలో కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ డి.జానకి**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 30 (ఆశ్వి అప్డేట్స్):**

జిల్లాలో నీట్ పీజీ ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మధుసూదన్ నాయక్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫాతిమా విద్యాలయం, JPNCE ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎస్పీ.. ప్రవేశ ద్వారాల వద్ద పోలీసుల విధులు, ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీసు సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




# వనస్థలిపురంలో రవీంద్రభారతి తరహా ఆడిటోరియం

- **రూ.25 కోట్లతో నిర్మాణానికి కృషి: మధుయాష్కి గౌడ్**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

వనస్థలిపురంలో రవీంద్రభారతి తరహాలో రూ.25 కోట్లతో ఆడిటోరియం నిర్మించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు.

వనస్థలిపురం రైతుబజార్ సమీపంలోని పార్కులో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఎస్.కె.ఎన్ కళాక్షేత్రం నిర్వహించిన సంగీత నృత్య రూపక కార్యక్రమానికి మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. 150 మంది విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలను వీక్షించి చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని, వనస్థలిపురంలో సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.







# హెచ్‌సీఏ మహిళల ఓపెన్ సెలక్షన్స్.. సెప్టెంబర్ 1 నుంచి

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) ఆధ్వర్యంలో మహిళల క్రికెట్ ఓపెన్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. వివిధ వయసు విభాగాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారిణులు ఈ ఎంపికలకు హాజరుకావాలని హెచ్‌సీఏ సూచించింది.

అండర్-15: సెప్టెంబర్ 1న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్)లో సెలక్షన్స్ జరుగుతాయి. 01092011 నుంచి 31082014 మధ్య జన్మించిన బాలికలు అర్హులు.

అండర్-19: సెప్టెంబర్ 2న ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు సెలక్షన్స్ నిర్వహిస్తారు. 01092007 లేదా ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. అండర్-23 & సీనియర్ మహిళలు: సెప్టెంబర్ 3న ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు సెలక్షన్స్ జరుగుతాయి. 01092003 లేదా ఆ తర్వాత జన్మించిన క్రీడాకారిణులు అర్హులు. సెలక్షన్స్‌కు హాజరయ్యే వారు జనన ధ్రువీకరణ పత్రం, పూర్తి సైజు ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు తీసుకురావాలి. స్పాట్ రిజిస్ట్రేషన్ సదుపాయం కూడా ఉంది. క్రీడాకారిణులు తప్పనిసరిగా కలర్ క్రికెట్ డ్రెస్సులోనే హాజరుకావాలి. వైట్ క్రికెట్ డ్రెస్సుకు అనుమతి లేదని హెచ్‌సీఏ వెల్లడించింది.



# మగ్గాలు ఇచ్చారు.. ముడి సరుకులు మరిచారు!

- **చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**నారాయణపేట, ఆగస్టు 30 (ఆశ్వి అప్డేట్స్):**

ప్రభుత్వం చేనేత కార్మికులకు మగ్గాలు అందించినా, వాటితో పని చేసేందుకు అవసరమైన ముడి సరుకులు సరఫరా చేయకపోవడంతో మగ్గాలు మూలకు పడిపోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో భాగంగా ఆదివారం నారాయణపేట పట్టణంలోని బురుడివాడి వీధిలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముడి సరుకులు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలు కూడా అందడం లేదని, దీంతో ఉపాధి కోసం షావుకారుల వద్ద తక్కువ కూలీకి పనిచేయాల్సి వస్తోందని తెలిపారు. కొంతమంది నేసిన చీరలను చేనేత సొసైటీలు కొనుగోలు చేయడం లేదని, సొసైటీల్లో సభ్యత్వం, చేనేత బీమా సౌకర్యం కూడా అందడం లేదని పేర్కొన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పొదుపు పథకంలో ఒక మగ్గానికి ఇద్దరు కార్మికులు అర్హులైనప్పటికీ ఒక్కరికే అవకాశం కల్పిస్తున్నారని నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, చేనేత కార్మిక సంఘం నాయకులు కెంచి నారాయణ, జనసేన నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు దాసరి అశోక్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిసె నరసింహ, సోఫీ మజార్ హుస్సేన్, వద్ది నారాయణ, యాబన్న చౌదరి, తులసి తదితరులు పాల్గొన్నారు.




## ప్రవక్త మహమ్మద్ బోధనలు
# మానవాళికి ఆదర్శం..

**హత్నూర, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

మహమ్మద్ ప్రవక్త పవిత్ర మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్‌ఏ సయ్యద్ అహ్మద్ షా ఖాద్రి బుఖారి రహమతుల్లా అలై, బర్గాలో లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మస్జిద్‌కు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు తరలివచ్చి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను, ఆయన మానవాళికి అందించిన సందేశాన్ని వివరించారు. ప్రవక్త మహమ్మద్ చూపిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, దయ, సోదరభావం, క్షమాగుణం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. పేదలు, అనాథలు, బలహీన వర్గాల పట్ల దయతో వ్యవహరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ప్రవక్త బోధనల్లో ముఖ్యమైన అంశాలని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మస్జిద్‌లో ప్రత్యేక దువా నిర్వహించారు. కార్యక్రమంలో ముక్య అతిథులుగా సబీర్ హుస్సేన్ , సాదిక్ హుస్సేన్,షేక్ హుస్సేన్,నిర్వాహకులు షకీల్ అహ్మద్ సభ్యులు, మతపెద్దలు, యువకులు, పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కెర్మెడెక్ దీవుల సమీపంలో భూకంపం

- రిక్టర్ స్కేలుపై 5.8 తీవ్రతగా నమోదు
- సముద్రంలోనే భూకంప కేంద్రం
- న్యూజిలాండ్ ప్రాంతంలో ప్రకంపనలు
- సునామీ హెచ్చరికలు లేవు

**కెర్మెడెక్ దీవులు, ఆగస్టు 30:**

న్యూజిలాండ్‌కు సమీపంలోని కెర్మెడెక్ దీవుల ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. సముద్రంలో చోటుచేసుకున్న ఈ ప్రకంపనల తీవ్రత 5.8గా నమోదైనట్లు తాజా భూకంప వివరాలు వెల్లడించాయి.

**సముద్ర గర్భంలో ప్రకంపనలు**

కెర్మెడెక్ దీవుల పరిసర ప్రాంతం భూకంప కార్యకలాపాలకు పేరుగాంచింది. తాజా ప్రకంపనలతో ఆ ప్రాంతంలో మరోసారి భూకంపం నమోదైంది. గతంలోనూ ఇక్కడ బలమైన భూకంపాలు సంభవించాయి.

**సునామీ ముప్పు లేదు**

భూకంపం సముద్ర ప్రాంతంలో సంభవించినప్పటికీ ప్రస్తుతానికి సునామీ ముప్పుపై ఎలాంటి హెచ్చరికలు వెలువడినట్లు తాజా సమాచారం లేదు.




# దేశమంతా ఇక ఒకే సమయం

- మార్చి 2027 నుంచి IST తప్పనిసరి
- చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్ వ్యవహారాలకు వర్తింపు
- ఆర్థిక లావాదేవీలు, టెలికాం, రవాణాపైనా ప్రభావం
- సైబర్ దాడుల నుంచి సమయ వ్యవస్థలకు రక్షణ
- ఉల్లంఘనలకు జరిమానా విధించే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

దేశంలో సమయ వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027 మార్చి నుంచి అన్ని సంస్థలు చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా అవసరాలకు భారత ప్రామాణిక సమయం (ఐఎస్‌టీ)నే తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్ టైమ్) రూల్స్, 2026ను కేంద్రం ప్రకటించింది. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురితమైన 180 రోజుల తర్వాత నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

**అధికారిక వ్యవహారాల్లో ఐఎస్‌టీ**

కొత్త నిబంధనల ప్రకారం ప్రత్యేక మినహాయింపు ఉన్న సందర్భాలు మినహా చట్టపరమైన, పరిపాలనా, అధికారిక పత్రాలు, రికార్డుల్లో ఐఎస్‌టీనే సమయ ప్రమాణంగా ఉపయోగించాలి. వాణిజ్యం, రవాణా, ప్రభుత్వ పరిపాలన, చట్టపరమైన ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీల్లోనూ ఇదే ప్రమాణాన్ని అనుసరించాలి.

**కొన్ని రంగాలకు మినహాయింపు**

విదేశీ సమయ మండలిని స్పష్టంగా పేర్కొనాల్సిన సందర్భాల్లో ఇతర సమయ ప్రమాణాలను ఉపయోగించేందుకు అవకాశం ఉంటుంది. శాస్త్రీయ పరిశోధనలు, నావిగేషన్, ఖగోళ శాస్త్ర కార్యకలాపాలు, ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతించిన సందర్భాలకు కూడా మినహాయింపులు వర్తిస్తాయి.

**డిజిటల్ వ్యవస్థలపై దృష్టి**

డిజిటల్ చెల్లింపులు, స్టాక్ మార్కెట్లు, టెలికాం నెట్‌వర్క్‌లు, 5జీ సేవలు, నావిగేషన్, విద్యుత్ గ్రిడ్‌లు, డేటా కేంద్రాలు వంటి కీలక వ్యవస్థలు అత్యంత ఖచ్చితమైన సమయ సమకాలీకరణపై ఆధారపడి పనిచేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే సమయ ప్రమాణం అమలు చేయడం ద్వారా లావాదేవీల నమోదు, వ్యవస్థల మధ్య సమన్వయం, నెట్‌వర్క్‌ల విశ్వసనీయత మెరుగుపడుతుందని కేంద్రం భావిస్తోంది.

**సైబర్ భద్రతకు ప్రాధాన్యం**

సమయ సమకాలీకరణ వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడంతోపాటు స్పూఫింగ్, జామింగ్ వంటి సైబర్ దాడుల నుంచి వాటిని రక్షించాల్సి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ అధీకృత సమయ వనరులను ఉపయోగించడం, సమయ వ్యవస్థ విఫలమైనప్పుడు పనిచేసే ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలకు నిబంధనలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అవసరమైన చోట అటామిక్ క్లాక్‌ల వంటి అత్యంత ఖచ్చితమైన సమయ వనరులను వినియోగించాల్సి ఉంటుంది.

**సంస్థలకు ముందస్తు సన్నద్ధత**

దేశవ్యాప్తంగా సమయానికి ఒకే ప్రమాణాన్ని ఏర్పాటు చేయడమే కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, టెలికాం, రవాణా, ప్రభుత్వ సేవలు, ఆర్థిక మార్కెట్లలో సమయ వ్యత్యాసాల వల్ల తలెత్తే సమస్యలను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది. నిబంధనలు అమల్లోకి రావడానికి 180 రోజుల గడువు ఉండటంతో సంస్థలు తమ డిజిటల్, సాంకేతిక వ్యవస్థలను ఐఎస్‌టీకి అనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత చట్టం ప్రకారం జరిమానాలు విధించే అవకాశం ఉంది.








# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- కలెక్టర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమీక్ష

**గద్వాల, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.

గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేసి, అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో పరిహారం వెంటనే జమ చేయాలని సూచించారు. సాగునీటి విడుదలకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ మండలాల్లో ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఎఫ్‌డీఏకు బాంబే హైకోర్టు షాక్


- సిప్లా లైసెన్స్ రద్దుపై తీవ్ర అభ్యంతరం
- ఎంసీఏ రెస్టారెంట్ల మూసివేతపైనా ప్రశ్నలు
- చట్టాన్ని సరిగ్గా విశ్లేషించలేదని ఆగ్రహం
- అధికారుల తీరు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వ్యాఖ్య
- కోర్టు హెచ్చరికలతో వెనక్కి తగ్గిన ఎఫ్‌డీఏ

**ముంబై, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)కు బాంబే హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిప్లా ఫార్మా సంస్థకు చెందిన పుణె యూనిట్ డ్రగ్ సేల్ లైసెన్స్ రద్దు, ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్స్‌ల సస్పెన్షన్‌పై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్టాన్ని పూర్తిగా పరిశీలించకుండా తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేసింది.

**సిప్లా లైసెన్స్ రద్దుపై ఆగ్రహం**

సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దుకు ముందు అనుసరించాల్సిన విధానాన్ని ఎఫ్‌డీఏ పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ సెలవు రోజున కంపెనీ ప్రతినిధిని విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఈమెయిల్ పంపడంపైనా అభ్యంతరం తెలిపింది. ఎఫ్‌డీఏ వ్యవహరించిన తీరు 'హైహ్యాండెడ్'గా ఉందని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా లైసెన్స్ రద్దు ఉత్తర్వులు జారీ చేశారని వ్యాఖ్యానించింది. కోర్టు అభ్యంతరాల నేపథ్యంలో సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దు ఉత్తర్వును ఎఫ్‌డీఏ వెనక్కి తీసుకుంది.




**ఎంసీఏ రెస్టారెంట్లపై చర్యకు ప్రశ్నలు**

బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లోని ఎంసీఏ ప్రాంగణంలో ఉన్న ఐదు రెస్టారెంట్ల కార్యకలాపాలను ఎఫ్‌డీఏ నిలిపివేసింది. అయితే తాజా తనిఖీల్లో ఆయా రెస్టారెంట్లు 88 శాతం మేర ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నట్లు తేలిందని కోర్టు దృష్టికి వచ్చింది. అయినప్పటికీ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

**ఒప్పందంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశం**

రెస్టారెంట్ల లైసెన్స్‌లు ఎంసీఏ పేరుతో ఉండగా.. వాటిని ఎంసీఏతో ఒప్పందం చేసుకున్న శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహిస్తోంది. ఇదే కారణంతో ఎఫ్‌డీఏ లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది. అయితే ఒక సంస్థ పేరుతో లైసెన్స్ ఉండి, మరో సంస్థ అదే ప్రాంగణంలో కార్యకలాపాలు నిర్వహించడాన్ని నిషేధించే నిబంధన చట్టంలో లేదని కోర్టు అభిప్రాయపడింది.

**'చట్టాన్ని అర్థం చేసుకుని వ్యవహరించండి'**

చట్టాన్ని అక్షరాలా పట్టుకుని ఆచరణాత్మక దృక్పథాన్ని పక్కన పెట్టొద్దని గత విచారణలోనే ఎఫ్‌డీఏ అధికారులకు కోర్టు సూచించింది. అయినప్పటికీ అధికారులు తమ ఆదేశాలను పట్టించుకోలేదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే వైఖరి కొనసాగితే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించింది. అవసరమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, 'మీరు లార్డ్ అనుకుంటున్నారా? ఏదైనా చేయొచ్చని భావిస్తున్నారా?' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

**రెస్టారెంట్లకు కార్యకలాపాలకు అనుమతి**

కోర్టు హెచ్చరికల నేపథ్యంలో ఎంసీఏకు కొత్త నోటీసు జారీ చేసి, ఎంసీఏ-శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మధ్య ఒప్పందంపై వారి వాదనను వినేందుకు ఎఫ్‌డీఏ అంగీకరించింది. అనంతరం కారణాలతో కూడిన తాజా ఉత్తర్వు జారీ చేస్తామని తెలిపింది. ప్రస్తుతం రెస్టారెంట్లు ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నందున వాటి లైసెన్స్ సస్పెన్షన్ ఉత్తర్వు రద్దయినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. దీంతో రెస్టారెంట్లు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చని తెలిపింది. సిప్లా కేసులో ప్యాకేజింగ్, రియాక్టిన్ ప్లస్ మాత్రల రీకాల్‌కు సంబంధించిన ఫాలోఅప్ తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తించామని ఎఫ్‌డీఏ తెలిపింది. ఈ కారణంగా పుణెలోని వాడ్కి ప్రాంతంలోని సిప్లా క్యారీయింగ్ అండ్ ఫార్వార్డింగ్ కేంద్రానికి సంబంధించిన డ్రగ్ సేల్ లైసెన్స్‌లను ఆగస్టు 27 నుంచి రద్దు చేసింది. అయితే హైకోర్టు తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో ఆ చర్యను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

# బిలావల్ భుట్టో పెళ్లి ప్రచారంపై క్లారిటీ

- యూరప్ రాజకుటుంబ యువతితో వివాహమంటూ ప్రచారం
- వార్తలు తప్పుడు, నిరాధారమన్న పీపీపీ నేత
- లిక్టెన్‌స్టెయిన్‌కు జర్దారీ వెళ్లినట్లు సోషల్ మీడియాలో కథనాలు

**కరాచీ, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ త్వరలో యూరప్‌కు చెందిన రాజకుటుంబ సభ్యురాలిని వివాహం చేసుకోబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని పీపీపీ నేత, కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ ఖండించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు తప్పుడు, నిరాధారమైనవని స్పష్టం చేశారు.

**రాజకుటుంబ యువతితో పెళ్లంటూ ప్రచారం**

38 ఏళ్ల బిలావల్.. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కుమారుడు. ఇటీవల ఆయన వివాహానికి సంబంధించిన పలు పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జర్దారీ తన కుమారుడి వివాహ తేదీ ఖరారు చేసేందుకు లిక్టెన్‌స్టెయిన్ వెళ్లినట్లు కొన్ని పోస్టుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా బిలావల్ వివాహం చేసుకోబోతున్న యువతి 26 ఏళ్ల మాజీ ఆస్ట్రియన్ ఆర్చ్‌డచెస్ గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ అంటూ ప్రచారం సాగింది.

**హ్యాబ్స్‌బర్గ్ వంశానికి చెందిన యువతి**

గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ ఆస్ట్రియా ఆర్చ్‌డ్యూక్ కార్ల్, ఫ్రాన్సెస్కా వాన్ థైసెన్‌బోర్నెమిస్జా కుమార్తెగా ప్రచారంలో ఉంది. హ్యాబ్స్‌బర్గ్‌లోరైన్ రాజవంశానికి చెందిన ఆమె.. ఆస్ట్రియా చివరి చక్రవర్తి, హంగేరీ చివరి రాజు కార్ల్ 1కి మునిమనవరాలిగా పేర్కొంటున్నారు. అయితే బిలావల్‌తో ఆమె వివాహం జరగబోతోందన్న ప్రచారానికి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

**పీపీపీ నేత ఖండన**

ఈ ప్రచారంపై ముర్తజా వహాబ్ శనివారం అర్ధరాత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు 'తప్పుడు, నిరాధారమైనవి' అని పేర్కొన్నారు. మరోవైపు పాకిస్థాన్‌కు చెందిన ఉర్దూ దినపత్రిక డైలీ ఔసాఫ్ కూడా బిలావల్ వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు కథనం ప్రచురించింది. అయితే ఆ కథనాన్ని అనంతరం తొలగించింది.

**జర్దారీ పర్యటనపై వివరాలు గోప్యం**

ఆగస్టు 27న పాకిస్థాన్ అధ్యక్ష భవన్ ఎక్స్‌లో ఆసిఫ్ అలీ జర్దారీ ప్రైవేట్ పర్యటన కోసం విదేశాలకు వెళ్లినట్లు వెల్లడించింది. అయితే పర్యటన ఉద్దేశాన్ని మాత్రం ప్రకటించలేదు. ఈ పర్యటనకు బిలావల్ వివాహ ప్రచారానికి సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు లేవు. బిలావల్ లేదా ఆయన కుటుంబ సభ్యులు కూడా వివాహంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న పెళ్లి వార్తలను నిరాధారమైనవిగానే పీపీపీ నేత కొట్టిపారేశారు.

# పాక్ గూఢచర్య నెట్‌వర్క్ గుట్టురట్టు

- లూథియానాలో 22 ఏళ్ల దుకాణదారుడి అరెస్ట్
- చైనా సీసీ కెమెరాలతో పాక్‌కు ప్రత్యక్ష ప్రసారం
- సైనిక కార్యకలాపాల సమాచారాన్ని చేరవేసినట్లు అనుమానం
- ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం అద్దెకు తీసుకున్న నిందితుడు
- రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడి

**లూథియానా, ఆగస్టు 30, ఆశ్వి అప్డేట్స్:**

పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి సంబంధించిన గూఢచర్య నెట్‌వర్క్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. పాకిస్థాన్ తరపున గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న 22 ఏళ్ల రచ్పాల్ సింగ్‌ను లూథియానాలో అరెస్టు చేశారు. నగరానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**చైనా సీసీ కెమెరాలతో నిఘా**

లూథియానా-ఫిరోజ్‌పూర్ రోడ్డులో నిందితుడు షూ దుకాణాన్ని అద్దెకు తీసుకున్నాడు. దుకాణం బయట రోడ్డువైపు చూసేలా చైనాలో తయారైన రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. వాటి ద్వారా పరిసరాల్లో జరుగుతున్న కార్యకలాపాలను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లు ప్రత్యక్షంగా పరిశీలించేవారని పోలీసులు తెలిపారు.

**ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం**

పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకే దుకాణాన్ని అద్దెకు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ ఏఐజీ సిమ్రత్ పాల్ సింగ్ ధిండ్సా తెలిపారు. ఆ దుకాణం బధోవాల్ ఆయుధ డిపోకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. నెలకు రూ.40 వేల అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


**రూ.3 లక్షలు చెల్లించినట్లు సమాచారం**

గూఢచర్య కార్యకలాపాలకు పాక్ హ్యాండ్లర్లు నిందితుడికి సుమారు రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడైంది. దుకాణం పెద్దగా వ్యాపారం లేకపోయినా అద్దె చెల్లించడం, కెమెరాల దిశను తరచూ మార్చడం పోలీసులకు అనుమానం కలిగించింది. లూథియానాలో భారీ దాడికి పాకిస్థాన్ ఏజెన్సీలు పన్నిన కుట్రలో భాగంగానే ఈ నిఘా సాగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



**సంయుక్తంగా అరెస్ట్**

ఆగస్టు 27న అందిన సమాచారంతో లూథియానా కమిషనరేట్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. రచ్పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.



# వేరుశనగ తింటే.. ఉక్కులా మారడం ఖాయం



వేరుశెనగను చాలా మంది ఇష్టపడతారు. వీటిని అనేక రకాలుగా ఆహారంలో చేర్చుకుంటారు. వర్షా కాలం వచ్చిందంటే చాలా మంది పచ్చి శనగలను కొని వేయించి లేదా ఉడకబెట్టి తింటారు. ఇది రుచికరమైన చిరుతిండి మాత్రమే కాదు ఇందులో ఎన్నో రకాల పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.ఉడికించిన వేరుశెనగను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. మీ రోజువారీ ఆహారంలో ఉడికించిన వేరుశెనగను చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**పోషకాలు:**
ఉడికించిన వేరుశెనగలో ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, వివిధ విటమిన్లు, ఖనిజాలతో సహా శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. ఇది మీ మొత్తం ఆరోగ్యానికి ముఖ్యమైనది.

**ఆరోగ్యకరమైన కొవ్వు:**
వేరుశెనగలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కొవ్వులని వైద్యులు చెబుతున్నారు. వీటిని పరిమిత పరిమాణంలో తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**యాంటీఆక్సిడెంట్ లక్షణాలు:**
ఉడికించిన పప్పులో రెస్వెరాట్రాల్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. ఈ యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఆక్సీకరణ ఒత్తిడి, వాపు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.

**బరువు విషయానికొస్తే:**
వేరుశెనగలో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. అయితే ఇందులో ఉండే అధిక ప్రోటీన్లు, ఫైబర్ కంటెంట్ కడుపు నిండుగా ఉంచి ఆకలిని నివారిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకుంటే, మీ ఆహారం సమతుల్యంగా ఉంటుంది. మీ బరువు పెరగదు.

**రక్తంలో చక్కెర నియంత్రణ:**
ఉడికించిన వేరుశెనగలో ఉండే ఫైబర్ కంటెంట్ చక్కెర శోషణను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ముఖ్యంగా షుగర్ సమస్యలతో బాధపడేవారికి ఉడికించిన అన్నం మంచి ఆహారంగా మారుతుంది.

**మానసిక ఆరోగ్యం:**
ఉడికించిన వేరుశెనగలో మెదడు ఆరోగ్యానికి అవసరమైన ఫోలేట్, నియాసిన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అవి నాడీ వ్యవస్థకు సహాయపడతాయి.అభిజ్ఞా పనితీరును మెరుగుపరుస్తాయి.






# బ్లాక్ కిస్‌మిస్‌లో.. బోలెడు ప్రయోజనాలు

కిస్మిస్‌లు సర్వసాధారణంగా దొరికేవే. అయితే మనలో చాలా మంది బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించరు. బ్లాక్ కిస్మిస్‌లతో పోల్చితే బ్రౌన్ కలర్‌లో ఉండే కిస్మిస్‌లను తీసుకోవడానికి మొగ్గు చూపుతుంటారు. అయితే చూడ్డానికి బాలేవని అస్సలు లైట్ తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ బ్లాక్ కిస్మిస్‌లను ఆహారంలో భాగం చేసుకుంటే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం..

* ప్రస్తుతం ఐరన్ లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కచ్చితంగా బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో రక్తం పెరగడంలో కిస్మిస్‌లు ఉపయోగపడతాయి.
* ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆస్టియోపోరోసిస్‌తో బాధపడేవారికి బ్లాక్ కిస్మిస్ చాలా మంచిది. బ్లాక్ కిస్మిస్‌తో ఎముకలకు బలం చేకూరుతుంది.
* రోగ నిరోధక శక్తిని పెంచడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా వార్షా కాలంలో వచ్చే ఇన్‌ఫెక్షన్ల బారి నుంచి తప్పించుకోవాలంటే బ్లాక్ కిస్మిస్‌లను తీసుకోవాలని నిపునులు చెబుతున్నారు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
* గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా నల్ల ఎండు ద్రాక్ష కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో పుష్కలంగా లభించే పొటాషియం, విటమిన్ సి గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. వీటిలోని విటమిన్ సి ధమనుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
* మలబద్ధకం, పైల్స్ వంటి జీర్ణాశయ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి కూడా బ్లాక్ కిస్మిస్‌లు బాగా ఉపయోగపడతాయని అంటున్నారు. వీటిలోని ఫైబర్ పేగు కదలికను ప్రోత్సహిస్తుంది. కిస్‌మిస్ తింటే.. జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం, పైల్స్ వంటి సమస్యలను దూరం చేస్తుంది.
* బ్లాక్ కిస్మిస్‌లను తీసుకునే విధానంలో కూడా కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కిస్మిస్‌లను రాత్రంతా నానబెట్టి ఉదయం తీసుకుంటే మరింత మేలు జరుగుతుందని చెబుతున్నారు. నాన బెట్టిన నీటిని తాగడం వల్ల కూడా ఎన్నో రకాల లాభాలు ఉంటాయని అంటున్నారు.





# జుట్టు సమస్యలకు.. పైనాపిల్‌తో చెక్..

పైనాపిల్ రుచికరమైన ఒక పండు. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అంతేకాకుండా, మీరు జుట్టు సంరక్షణ కోసం కూడా దీనిని ఉపయోగించవచ్చు. ఇది బ్రోమెలైన్ వంటి ఎంజైమ్ లను కలిగి ఉంటుంది. ఇది జుట్టు పెరుగుదలను పెంచడంలో సహాయపడుతుంది. పైనాపిల్‌ను ఉపయోగించడం ద్వారా మీరు జుట్టు సమస్యల నుండి బయటపడతారు. మీ జుట్టు మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది. పైనాపిల్ ను జుట్టుకు అప్లై చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఒకసారి చూద్దాం.

**చుండ్రు నుండి ఉపశమనం:**
మీరు చుండ్రు సమస్యతో పోరాడుతున్నట్లయితే, పైనాపిల్ వాడకం మీకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఓ ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.., ఇది సహజ యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంది. ఈ లక్షణాల కారణంగా, మీరు జుట్టులో పెరిగే ఈస్ట్ నుండి బయటపడవచ్చు. ఇది చుండ్రుకు ప్రధాన కారణం.

**జుట్టు మెరిసిపోతుంది:**
పైనాపిల్‌లో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. దీని ద్వారా జుట్టు సిల్కీగా తయారవుతుంది. ఓ ప్రచురించబడిన ఒక అధ్యయనంలో దీని ద్వారా జుట్టు సహజమైన షైన్ పునరుద్ధ.రించబడుతుందని వెల్లడించింది. పైనాపిల్‌లో ఉండే పోషకాలు పర్యావరణ మూలకాల వల్ల కలిగే నష్టం నుండి జుట్టును రక్షిస్తాయి. ఈ కారణంగా జుట్టు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మెరిసేలా కనిపిస్తుంది.

**చిక్కుబడ్డ జుట్టును పరిష్కరించడం:**
వర్షా కాలంలో పెరిగిన తేమ కారణంగా జుట్టు జిగటగా మారుతుంది. దాంతో వెంట్రుకలు సులభంగా చిక్కుకుపోతాయి. అయితే, ఈ సమస్యను అధిగమించడానికి మీరు పైనాపిల్ ఉపయోగించవచ్చు. పైనాపిల్ సహజ మాయిశ్చరైజింగ్ లక్షణాలను కలిగి ఉంది. ఇది జుట్టు మూలాలను హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది. ఈ లక్షణాల ద్వారా చిక్కుబడ్డ జుట్టు సులభంగా పరిష్కరించబడుతుంది.

**రంగు జుట్టుకు:**
ఈ రోజుల్లో ప్రజలు జుట్టు రంగును ఉపయోగించటానికి ఇష్టపడుతున్నారు. ఇది మంచి రూపాన్ని ఇస్తుంది. అయినప్పటికీ, జుట్టుకు రంగు వేయడానికి రసాయన జుట్టు రంగును ఉపయోగిస్తారు. ఇది చాలా హానికరం. ఈ రంగుల వల్ల కలిగే నష్టాన్ని సరిచేయడానికి మీరు పైనాపిల్‌ను ఉపయోగించవచ్చు. దీని ద్వారా రంగు మసకబారదు.








# ఓటీటీలోకి కొరియన్ కనకరాజు

ఓటీటీలోకి కొత్త తెలుగు సినిమా వచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. మెగా హీరో వరుణ్ తేజ్ చేసిన హారర్ కామెడీ మూవీ 'కొరియన్ కనకరాజు'. గత నెలలో థియేటర్లలో రిలీజైంది. సూపర్ కాకపోయినప్పటికీ ప్రేక్షకుల్ని మంచి స్పందన రాబట్టుకుని చెప్పుకోదగ్గ వసూళ్లు కూడా సాధించింది. ఇదే ఇప్పుడు స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది.

సాధారణంగా హారర్ అంటే మన దేశ నేపథ్యంగానే తీస్తుంటారు. కానీ ఈ సినిమాలో మాత్రం హీరో ఒంటిలోకి కొరియన్ ఆత్మ ప్రవేశిస్తుంది. తద్వారా వచ్చే కామెడీని బేస్ చేసుకుని తెరకెక్కించారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ నటించింది. సత్య కీలక పాత్ర చేశాడు. మేర్లపాక గాంధీ దర్శకుడు. ఆగస్టు 07న థియేటర్లలో రిలీజ్ కాగా ఇప్పుడు సెప్టెంబరు 04 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లోకి తీసుకురానున్నారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోనూ స్ట్రీమింగ్ చేయనున్నారు. అధికారికంగా నెట్‌ఫ్లిక్స్ అప్‌డేట్ ఇచ్చేసింది.

'కొరియన్ కనకరాజు' విషయానికొస్తే.. ఓ వ్యక్తి చనిపోతాడు. అతడి అస్తికల్ని కొరియన్ కుండలో ఉంచుతారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం లాంటిది జరిగి ఆ కుండ కనిపించకుండా పోతుంది. అది అలా అలా చేతులు మారి అనూహ్యంగా అనంతపురం చేరుతుంది. కట్ చేస్తే పెనుకొండలో ఉండే కనకరాజు (వరుణ్ తేజ్)కి కోపం ఎక్కువ. ఆ కోపంలో ఎవర్నైనా చితకబాదుతాడు. అదే ఊరిలో చైత్ర (రితికా నాయక్) కియా కంపెనీలో ఉద్యోగం చేస్తుంటుంది. ఇదిలా ఉండగా ఆ అనంతపురం వచ్చిన అస్తికల కుండ ఒక బార్‌కి చేరుతుంది. అయితే ఒకరోజు గొడవలో కనకరాజు.. ఆ అస్తికల కుండతో ఒకడిని కొట్టడంతో దాని మూత ఊడుతుంది. దాని డిజైన్ ఏదో బాగుందనుకుని అందులో మందు మిక్స్ చేసుకుని తాగుతాడు. అంతే అందులో ఉన్న కొరియన్ ఆత్మ కనకరాజుని ఆవహిస్తుంది. తర్వాత ఏమైంది? ఆ కొరియన్ ఆత్మ ఎవరిది? అది చేసే పనులేంటి? కనకరాజు ఆ ఆత్మ బారి నుంచి ఎలా తప్పించుకున్నాడనేది మిగతా స్టోరీ.

# సెప్టెంబర్ ఫెస్టివల్స్ స్పెషల్...

సెప్టెంబర్ నెల చాల ప్రత్యేకం. ఎందుకంటే ఈ నెలలోనే చాలా ఫెస్టివల్స్ ఉంటాయి. చిన్నాపెద్దా లేకుండా జరుపుకొనే పండుగల్లో ఒక్కటేన వినాయక చవితి పండుగ కూడా ఈ నెలలోనే ప్రారంభమవుతుంది. సోమవతి అమావాస్య తర్వాత భాద్రపద మాసం కూడా ప్రారంభం కానుంది. ఈ సమయంలో గణేష్ ఉత్సవాలను దేశవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. గణేష్ చతుర్థితో పాటు రిషి పంచమి, పోలాల అమావాస్య, రాధా అష్టమి, ఓనం వంటి ముఖ్యమైన పండుగలు కూడా ఇదే నెలలో రానున్నాయి. మరోవైపు పిత్రు పక్షాలు కూడా సెప్టెంబర్ మాసంలోనే ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో పూర్వీకులను స్మరించుకుంటూ శ్రాద్ధ కర్మలు నిర్వహిస్తారు. హిందూ క్యాలెండర్ ప్రకారం సెప్టెంబర్ నెలలో ఏయే తేదీల్లో ఏయే పండుగలొచ్చాయనే విషయాలు మీకోసం...

**వరాహ జయంతి, 6 సెప్టెంబర్ 2024 :**
ఇదే నెలలో సెప్టెంబర్ 6న శుక్రవారం నాడు హర్తాళ్ తీజ్ ఉపవాస దీక్షను ఆచరిస్తారు. అంతేకాదు ఈరోజున వరాహ జయంతిని జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజు అవివాహితులు తమకు కావాల్సిన వరుడిని పొందడానికి ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతం చేయడం వల్లే పార్వతీ దేవి శివుడిని భర్తగా పొందినట్లు పురాణాల్లో పేర్కొనబడింది.

**గణేష్ చతుర్థి, 7 సెప్టెంబర్ 2024 :**
ఈ నెల సెప్టెంబర్ 7న శనివారం నుంచి వినాయక ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు అనంత చతుర్దశి నాడు ముగుస్తాయి. ఈ పవిత్రమైన రోజున గల్లీ నుంచి ఢిల్లీ దాకా మండపాలలో వినాయకుడిని ప్రతిష్టించి ఘనంగా సంబరాలు జరుపుకుంటారు. విఘ్నాలు తొలగించే వినాయకుడిని పూజించడం కష్టాలన్నీ తొలగిపోతాయని చాలా మంది నమ్ముతారు.


**రిషి పంచమి, 8 సెప్టెంబర్ 2024 :**
రిషి పంచమి వ్రతం చేసే మహిళలకు రుతుక్రమం సమయంలో చేసే తప్పుల నుంచి విముక్తి నిస్తుంది. ఈ కాలంలో సప్త ఋషులను పూజిస్తారు.

**రాధాష్టమి, మహాలక్ష్మి వ్రతం, 11 సెప్టెంబర్ 2024 :**
శ్రీ క్రిష్ణ జన్మాష్టమి తర్వాత కన్నయ్య ఆశీస్సులను సంపూర్ణంగా పొందాలనుకుంటే, రాధా అష్టమి రోజున రాధ దేవిని పూజించి. ఇలా పూ చేయడం వల్ల మీ జీవితంలో ఆనందం, శాంతి పెరుగుతుంది.

**వామన జయతి, ఓనం, 15 సెప్టెంబర్ 2024 :**
దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా కేరళ రాష్ట్రంలో ఓనం పండుగను అత్యంత ఘనంగా జరుపుకుంటారు. ఇదే రోజున వామన జయంతి జరుపుకుంటారు.

**అనంత చతుర్దశి, 17 సెప్టెంబర్ 2024 :**
సెప్టెంబర్ 17వ తేదీన అనంత చతుర్దశి వేళ గణేష్ ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ పవిత్రమైన రోజున వినాయకుడికి వీడ్కోలు పలుకుతారు.

**భాద్రపద పూర్ణిమ, 18 సెప్టెంబర్ 2024 :**
ఈ ఏడాది సెప్టెంబర్ 18న భాద్రపద పూర్ణిమ ఏర్పడనుంది. ఇదే సమయంలో రెండో చంద్ర గ్రహణం ఏర్పడనుంది. ఇది పాక్షిక గ్రహణంగా ఉంటుంది. ఇదే సమయంలో పిత్రు పక్షాలు ప్రారంభం కానున్నాయి.



# వినాయకుడి పూజకు ఇదే సరైన సమయం...





గణేష్ చతుర్థి పండుగకు హిందూ మతంలో ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ పండుగ వినాయకుడి పుట్టినరోజు వేడుకగా జరుపుకుంటారు. గణేష్ చతుర్థి రోజున, జ్ఞానం, శ్రేయస్సు, అదృష్టానికి ప్రతీకగా పిలిచే వినాయకుడిని పూజిస్తారు. భాద్రపద మాసం శుక్ల పక్షం నాలుగో రోజున వినాయకుడు జన్మించాడని నమ్ముతారు.

**వినాయక చవితి 2024 ఎప్పుడు...**
2024 లో వినాయక చవితి శనివారం సెప్టెంబర్ 07 న వచ్చింది. గణేష్ చతుర్థి సందర్భంగా ప్రజలు వినాయకుడి విగ్రహాన్ని తమ ఇంటికి తీసుకువచ్చి ప్రతిష్టించి నవరాత్రులు పూజలు నిర్వహిస్తారు.

**గణపతి స్థాపన, పూజ ముహూర్తం...**
గణేశుడి మధ్యాహ్నం కాలంలో జన్మించాడని నమ్ముతారు. అందువల్ల మధ్యాహ్నం సమయం గణేష్ ఆరాధనకు అత్యంత అనువైనదిగా పరిగణిస్తారు. ధృక్ పంచాంగం ప్రకారం, గణేష్ చతుర్థి రోజున మధ్యాహ్నం గణపతి పూజ ముహూర్తం ఉదయం 11:03 నుండి మధ్యాహ్నం 01:00 వరకు ఉంటుంది. ఆరాధన మొత్తం వ్యవధి 02 గంటల 31 నిమిషాలు.

**చతుర్థి తిథి...**
ధృక్ పంచాంగం ప్రకారం చతుర్థి తిథి 03:03 PM నుండి 06 సెప్టెంబర్ 2024 నుండి సెప్టెంబర్ 7వ తేదీ సాయంత్రం 5.37గంటల వరకు ఉంటుంది.

**గణేష్ నిమజ్జనం ఎప్పుడు...?**
గణేష్ ఉత్సవాలు 10 రోజుల పాటు జరుగుతాయి. ఇది అనంత్ చతుర్ధశి రోజున ముగుస్తుంది. ఈ రోజు వినాయకుడిని నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది గణేష్ విసర్జన్ మంగళవారం 17 సెప్టెంబర్ 2024 న ఉంది. అనంత్ చతుర్ధశి రోజున భక్తులు గణపతి బప్పాకు వీడ్కోలు పలుకుతారు. గణేశుని విగ్రహాన్ని చెరువు, సరస్సు లేదా నదిలో నిమజ్జనం చేసే సంప్రదాయం ఉంది.

**ఎలాంటి విగ్రహం తీసుకోవాలి...?**
మొదటి సారి మీరు వినాయక చవితి రోజు వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఎలాంటి విగ్రహం ఇంటికి తీసుకొస్తే బాగుంటుందో తెలుసుకోవాలి. గణేష్ విగ్రహాన్ని ఎన్నుకునేటప్పుడు తొండం ఎడమ వైపు వంగి ఉన్న దాన్ని ఎంచుకోవడం చాలా శుభంగా పరిగణిస్తారు. అలాగే కూర్చుని ఉన్న గణేష్ విగ్రహం కొనుగోలు చేయండి. ఇది ఆనందం, శ్రేయస్సును సూచిస్తుంది. అలాగే గణేషుడి భంగిమలో ఒక చేతిలో మోదక్, రెండో చేత్తో ఆశీర్వాదం ఇస్తున్నట్టుగా ఉంటే మంచిది. ఇంటి ఈశాన్య దిశలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించవచ్చు. విగ్రహం ఉత్తరం వైపు ఎదురుగా ఉండాలి. శుభ్రమైన వేదిక వేసి దాని మీద ప్రతిష్టించాలి. ఈ దిశలో విగ్రహాన్ని పెట్టడం వల్ల ఇంటికి సానుకూల శక్తి, ఆశీర్వాదాలు లభిస్తాయి. అలాగే ఎప్పుడు ఒకటి కంటే ఎక్కువ వినాయకుడి విగ్రహాలు ఇంట్లో ఉండకూడదు. అది మాత్రమే కాదు వినాయకుడి విగ్రహాన్ని ఒంటరిగా ఉంచకూడదు. లక్ష్మీదేవి విగ్రహాన్ని కూడా పక్కన ఏర్పాటు చేయాలి.

**ఏ రంగు మచిది...?**
విగ్రహం ఎరుపు లేదా కుంకుమ రంగులో ఉన్నది ఇంటికి తీసుకురావడం మంచిది. ఇది ఆత్మవిశ్వాసం పెంచుతుంది, జీవితంలో ఏవైనా అడ్డంకులు లేదా సమస్యలు ఉంటే తొలగిస్తుందని నమ్ముతారు. మీరు తెలుపు రంగు వినాయకుడి విగ్రహాన్ని తీసుకురావచ్చు. ఇది ఇంటికి ఆనందం, శాంతిని అందిస్తుంది. గంగాజలంతో శుద్ధి చేసిన తర్వాత పూజలు చేయాలి. మూడు, ఐదు, ఏడు లేదా తొమ్మిది రోజుల పాటు విగ్రహాన్ని ఉంచుకోవచ్చు. ఉదయం, సాయంత్రం దీపం వెలిగించి పూజలు చేయాలి. పండ్లు, పూలతో

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S